మార్కెట్లకు దీపావళి శోభ

● కొనుగోలుదారులతో కిటకిట ● డిస్కౌంట్లతో ఆకట్టుకుంటున్న వ్యాపారులు


కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న టపాసుల దుకాణం


రకరకాల మట్టి ప్రమిదలు


మార్కెట్‌లో అందుబాటులో ఉన్న వివిధ రకాల బొమ్మలు


వివిధ రకాల లైటింగ్స్


లక్ష్మీదేవి విగ్రహాలు

మూసాపేట/ఓల్డ్ బోయిన్‌పల్లి: దీపావళికి అంతా సిద్ధమైంది. ఇళ్ల ముందు, దుకాణాల్లో వివిధ రకాల దీపాలు వెలిగించడం, స్నేహితులకు, బంధువులకు మిఠాయిలు, డ్రైఫ్రూట్స్ బహుమతిగా ఇవ్వడం, వ్యాపారస్తులు దుకాణాల్లో లక్ష్మి పూజలు చేయడం తదితర వాటితో మార్కెట్లకు దీపావళి శోభ సంతరించుకుంది. ఆలయాలు ముస్తాబు అయ్యాయి. మార్కెట్‌ల్లో బాణసంచా దుకాణాలు, ప్రమిదల దుకాణాలు, బంతిపూలు, పండ్ల వ్యాపారాలు, మిఠాయి దుకాణాలు కొనుగోలు దారులతో కిటకిటలాడుతున్నాయి. వివిధ రకాల ఆఫర్లతో స్వీట్ షాపులు ఆకర్షిస్తున్నాయి. కూకట్‌పల్లిలోని వివిధ కూడళ్ల వద్ద స్టాల్స్ ఏర్పాటు చేసి కేజీ సేల్, భారీ డిస్కౌంట్ అంటూ వినియోగదారులను ఆకర్షిస్తున్నారు. అంతేకాకుండా బంతి పూలను కూడా రాశులుగా పోసి విక్రయిస్తున్నారు. వీటి కొనుగోలుకు ఇటు మహిళలు, అటు చిన్నారులు మార్కెట్‌కి రావటంతో మార్కెట్ కిటకిటలాడుతున్నాయి.


విక్రయానికి సిద్ధంగా ఉంచిన బంతి పూలు

జీవితాల్లో వెలుగులు నింపాలి

పీఏసీ చైర్మన్ గాంధీ



ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, శ్రేయోభిలాషులకు పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. చీకటిని పారద్రోలి వెలుగునిచ్చే దీపావళి పర్వదినం ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. సకల శుభాలను, విజయాలను, సిరి సంపదలను, సుఖ సంతోషాలను ఎల్లవేళలా ప్రసాదించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని పేర్కొన్నారు. బాణసంచా కాల్చే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు.

వాహనం ఢీ.. వ్యక్తి మృతి



మియాపూర్ : వాహనం ఢీకొన్న ఘటనలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం...హఫీజ్‌పేటలోని జెన్‌ప్యాక్ ఎదురురోడ్డులో ఓ వ్యక్తి పడి ఉన్నాడని స్థానికులు శనివారం అర్ధరాత్రి మియాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా ఆ వ్యక్తి మృతి చెందాడు. అతనికి సంబంధించిన వివరాలు లేకపోవడంతో చుట్టుపక్కల ఆరా తీయగా సమాచారం లభించలేదు. వ్యక్తికి సుమారు (40) సంవత్సరాల వయస్సు ఉంటుందని పోలీసులు తెలిపారు. వాహనం ఢీకొన్న ఘటనలో మృతి చెంది ఉంటాడని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు.

ఘనంగా రుద్రహోమం



రాయదుర్గం: ధన్వంతరి జయంతి, మాస శివరాత్రిని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని శివసాయి క్షేత్రంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో గణపతి, శ్రీసూక్త, ధన్వంతరి, నవగ్రహ, రుద్రహోమాలను వైభవంగా నిర్వహించారు.అనంతరం పూర్ణాహుతి చేశారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

పేరుకుపోతున్న చెత్త



మియాపూర్ : మియాపూర్ డివిజన్ పరిధిలో పారిశుద్ధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. మియాపూర్‌లోని జేపీఎన్‌నగర్ నుండి మక్తమహబూబ్‌పేట రోడ్డుకు ఇరువైపులా ఖాళీ ప్రదేశంలో చెత్తకుప్పలు పేరుకుపోయాయి. ఈ రోడ్డు వెంబడి ప్రతివారం సంత జరుగుతుంది. సంతలో పాడైన కూరగాయలు, పండ్లు, చెత్తచెదారాన్ని రోడ్డు పక్కనే ఖాళీ స్థలంలో వేస్తున్నారు. రెండు, మూడు రోజులైనా వ్యర్థాలను తొలగించడం లేదు. దీంతో దుర్వాసన వస్తుంది. అదేవిధంగా దీప్తిశ్రీనగర్ కాలనీలో కూడా రోడ్డు పక్కన ఖాళీ ప్రదేశాల్లో చెత్త పేరుకుపోతోంది. అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బాణసంచాతో జాగ్రత్త!



ఓల్డ్‌బోయిన్‌పల్లి: దీపావళి అంటేనే టపాసులు కాల్చడం. కాల్చడంలో సరదాగా ఉన్నప్పటికీ వాటి వాడకం పట్ల ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. దీపావళి సందర్భంగా పెద్ద పెద్ద శబ్దాలు చేసే టపాసులు కాల్చేటప్పుడు పిల్లలను దూరంగా ఉంచేలా కుటుంబ సభ్యులు చర్యలు తీసుకోవాలి.

- టపాసులను చట్టం ప్రకారం అనుమతి పొందిన దుకాణాల వ్యాపారుల నుంచి కొనుగోలు చేయాలి.
- టాపాసులు కాల్చే సమయాల్లో ముందుగానే సమీపంలో నీటితో నిండిన బకెట్లను ఏర్పాటు చేయాలి.
- పిల్లలు బాణసంచా కాల్చే సమయంలో కుటుంబ సభ్యులు పర్యవేక్షించాలి.
- పిల్లలతో సహా పెద్దలందరు విధిగా కంటి అద్దాలు, కాళ్లకు చెప్పులు, కాటన్ దుస్తులు ధరించాలి.
- కొవ్వొత్తులను, అగర్‌బత్తీలను ఉపయోగిస్తూ టాపాసులు కాల్చాలి.
- టపాసులను చేతిలో పట్టుకుని కాల్చకూడదు.

లక్ష రూపాయల విరాళం అందజేత



మోతీనగర్: దుట్టా రాఘవమ్మ ఇంటిగ్రిటి వాలంటరీ ఎవల్యూషన్ వ్యవస్థాపక అధ్యక్షులు దుట్టా రవీంద్రనాథ్ ఠాగూర్ సేవ భారతి పబ్లిక్ చారిటబుల్ ట్రస్ట్‌కి ట్రస్టీగా నియమించిన సందర్భంగా లక్ష రూపాయల ఆర్థిక విరాళం అందించారు. ఈ సందర్భంగా సేవా భారతి మేనేజింగ్ ట్రస్టీ సీఎస్ఆర్ మూర్తి మాట్లాడుతూ.. రవీంద్రనాథ్ ఠాగూర్ లాంటి యువత పాత్ర సేవా భారతికి చాలా అవసరమని అన్నారు. కార్యక్రమంలో సేవా భారతి కమిటీ సీతారామయ్య, బైరెడ్డి సూర్యనారాయణ, మూర్తి, చంద్ర, ఉమ మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

యువత సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి

మూసాపేట: యువత సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. ఆదివారం మూసాపేటలోని వార్డు కార్యాలయం వద్ద దీపావళి పండుగ సందర్భంగా లక్ష్మీపేట చిన్నారావు ఆధ్వర్యంలో మహిళలకు స్వీట్లు, దీపంతాలు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, బీ బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, నాయకులు తూము రజనికాంత్, సప్పిడి భాస్కర్, చున్నూ పాషా, కొండల్‌రావు, సంతోష్, జోజమ్మ, పాష తదితరులు పాల్గొన్నారు.


స్వీట్లు, దీపంతాలు అందజేస్తున్న బండి రమేష్

డ్రైనేజీ రిటైనింగ్ వాల్ నిర్మాణానికి కృషి


డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: షిరిడీ నగర్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. ఆదివారం కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఓపెన్ నాలాకు రిటైనింగ్ వాల్ కొంత మేర పెండింగ్ ఉందని, సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలో రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. కాలనీ వాసులు కాలనీ అసోసియేషన్ కార్యాలయం నిర్మించుకుంటామని ఆయన దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన సానుకూలంగా స్పందించి తగిన సహాయ సహకారాలు అందజేస్తానని తెలిపారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సీహెచ్ శ్రీధర్, వైస్ ప్రెసిడెంట్ అమరేందర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ మూర్తి, ట్రెజరర్ ప్రవీణ్‌సింగ్, సభ్యులు చంద్రమౌళి, ప్రకాష్, ఉదయ్‌కిరణ్, సాయిబాబా, రాజేష్, సురేష్ బాబు, రమేష్, రాంగోపాల్, ఆనందబాబు, మూల్‌చంద్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్యార్వీ షరీఫ్ ఉత్సవం


కార్యక్రమంలో పాల్గొన్న మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు గౌసుద్దీన్, దర్గా కమిటీ సభ్యులు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని న్యూ అల్లాపూర్ గౌస్-ఎ-అజయ్ దస్తగీర్ దర్గా కమిటీ ఆధ్వర్యంలో గ్యార్వీ షరీఫ్ ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు గౌసుద్దీన్ హాజరయ్యారు. మన సమాజంలో ఐక్యత, పరస్పర గౌరవం పెంపొందించుకోవడం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు షేక్ ఇస్మాయిల్, ఫక్రుద్దీన్, మొహిసిన్, నూర్‌ఖాన్, ఖాదీర్, స్థానిక పెద్దలు, మైనార్టీ నాయకులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం అభినందనీయం

నిజాంపేట్: ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని మాజీ కార్పొరేటర్ రవి కిరణ్ అన్నారు. ఆదివారం కేటీఆర్ కాలనీ పార్క్‌లో ప్రీతి కిడ్నీ హాస్పిటల్ నిర్వహించిన ఉచిత కిడ్నీ ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించేందుకు వైద్య శిబిరాలు దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రూప, డాక్టర్ రంగప్ప, ప్రీతి కిడ్నీ హాస్పిటల్ నిర్వాహకులు పాల్గొన్నారు.